క్లుప్తంగా

జిల్లా చిన్నారులకు స్కిప్పింగ్‌లో బంగారు పతకాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 14, 15 తేదీల్లో ఢిల్లీలో జరిగిన జాతీయ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో గుంటూరుకు చెందిన చిన్నారులు అండర్-10 విభాగంలో పలు పతకాలు సాధించారని బండి సాహితి రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండి అశోక్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజా మీనాక్షి, ప్రజ్ఞ, కారుణ్య, ధనుశ్రీలు బంగారు, కాంస్యత పతకాలు సాధించారన్నారు. వీరిని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము) తన కార్యాలయంలో అభినందించారన్నారు.

టెన్త్ ఫలితాల్లో శ్రీపూజిత విజయకేతనం



గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీపూజిత స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి తెలిపారు. పట్టాభిపురంలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కె.సుజన్ 588 మార్కులతోపాటు ఏ.విఘ్నేష్ కార్తీక్ 578, డి.శ్రీకృష్ణ కౌశిక్ 577 మార్కులు సాధించినట్లు వివరించారు. 32 మంది విద్యార్థుల్లో 19 మంది 500కు పైగా మార్కులు సాధించగా, సబ్జెక్టుల వారీగా నూరు శాతం మార్కులను ఎక్కువ మంది సాధించారని తెలిపారు.

కెనడీ విద్యార్థుల ప్రతిభ..
పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కెనడీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ కె.శ్రీకాంత్ బాబు తెలిపారు. అరండల్‌పేటలోని పాఠశాలలో సోమవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ విద్యార్థినులు తిధి మైతి, ఆర్. గీతికలు 593 మార్కులు సాధించారని తెలిపారు. 60 మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు వచ్చాయని వివరించారు. పాఠశాల వ్యవస్థాపకురాలు బేబీ సావిత్రి, డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీ విద్య, ప్రిన్సిపాల్ ఐజక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రజ్ఞ స్కూల్ విద్యార్థుల ప్రతిభ ..
పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రజ్ఞ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ తెలిపారు. నగరంపాలెంలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చక్రనాగ్ మాట్లాడుతూ పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 11 మంది 500కు పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎస్.జాహ్నవి 583, ఎ.లహరి ప్రియ 579, లక్ష్మీ నారాయణ శివ మణికంఠ 554 మార్కులు సాధించారని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎన్.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రగతి చాటిన మాంటిస్సోరి ..
పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల అధినేత కేవీ సెబాస్టియన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సెబాస్టియన్ మాట్లాడుతూ యు. నర్మద 590 మార్కులు, షేక్ ప్రజ్ఞిత 588, బి. సాయి యశస్వి 587 మార్కులు సాధించినట్లు తెలిపారు. పరీక్షలు రాసి 62 మంది విద్యార్థుల్లో తొమ్మిది మంది 580కు పైగా సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైన్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ ..
పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సంగడిగుంటలోని జైన్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని పాఠశాల డైరెక్టర్ ఎండీ మున్నా తెలిపారు. షేక్ రఫీ 586 మార్కులతో పాటు 550కి పైగా 13 మంది సాధించారని వివరించారు. 500కు పైగా 30 మంది సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ అభినందించారు.

నేడు సీపీఐ ఎంపీ అభ్యర్థి జంగాల నామినేషన్

లక్ష్మీపురం: సీపీఐ గుంటూరు ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ మంగళవారం నామినేషన్ వేయనున్నట్లు పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. ఉదయం 10 గంటలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి ర్యాలీగా బయలుదేరి గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేస్తారని తెలిపారు.

కార్పొరేషన్.. సత్తా చాటెన్

- పది ఫలితాల్లో నగరపాలక సంస్థ పాఠశాలల్లో 77 శాతం ఉత్తీర్ణత నమోదు
- 500కు పైగా మార్కులు సాధించిన 138 మంది విద్యార్థులు
- కార్పొరేషన్ 14 హైస్కూళ్లతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తమ ఫలితాలు



శ్రీశారదానికేతన్ హైస్కూల్ విద్యార్థినులను అభినందిస్తున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఉషాకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గుంటూరు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు నమోదయ్యాయి. నగర పరిధిలోని 14 ఉన్నత పాఠశాలల్లో 77 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పరీక్షలకు హాజరైన 1,383 మంది విద్యార్థుల్లో 1,064 మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా ఆయా పాఠశాలల పరిధిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 138 మంది ఉన్నారు. ఇజ్రాయిల్‌పేటలోని బొర్రా నాగేశ్వరరావు ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ ఫాతిమా తబసుమ్ అత్యధికంగా 582 మార్కులతో టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా విద్యార్థులు వరుసగా 578, 571, 568, 565, 560, 557, 555, 547, 526, 483 వంటి అత్యుత్తమ మార్కులను సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తమ ఫలితాలు..

- బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పరీక్షలు రాసిన 49 మంది విద్యార్థినుల్లో 48 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈసందర్భంగా విద్యార్థినులను గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎస్.ఉషాకుమారి అభినందించారు.
- వేణుగోపాల్‌నగర్‌లోని ఎస్‌కేబీపీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసిన 116 మంది విద్యార్థుల్లో 108 మంది ఉత్తీర్ణులయ్యారు. 93 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మహిళా అధ్యయన కేంద్రం పుస్తకాలు ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ముద్రించిన రెండు పుస్తకాలను సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కేవీ శాంతిశ్రీ మాట్లాడుతూ 2018 నుంచి 2023 వరకు యూనివర్సిటీలోని అన్ని కళాశాలల్లో జెండర్ ఆడిట్‌తో రూపొందించిన పుస్తకమని, మరొకటి మహిళా అధ్యయనకేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ సదస్సుకు సంబంధించిన పబ్లికేషన్స్‌ను 'రిజర్వేషన్స్ ఆఫ్ ఉమెన్ ఇన్ లెజిస్లేషన్స్, డైమెన్షన్స్ ఆఫ్ పొలిటికల్ ఎంపవర్మెంట్' అనే పుస్తకమని తెలిపారు. జెండర్ ఆడిట్ పుస్తకానికి తనతోపాటు, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి రచయితలుగా వ్యవహరించామని తెలిపారు. రానున్న రోజుల్లో మహిళా అధ్యయన కేంద్రం విస్తృత కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్దయ్య, మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

26లోగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి



జేసీ రాజకుమారి

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికల విధుల ఉత్తర్వులు అందుకున్న ప్రిసైడింగ్ అధికారులు, ఇతరులు ఫారం 12 అప్లికేషన్ను ఈనెల 26వ తేదీలోగా అందజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి కోరారు. సోమవారం మంగళగిరిలోని ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల విధుల ఉత్తర్వులు అందుకున్న ప్రిసైడింగ్ అధికారులు,ఇ తర పోలింగ్ అధికారులు, పోలీసులు, సెక్టార్ అధికారులు, బూత్ లెవల్ అధికారులు, డ్రైవర్లు, క్లీనర్లు, వీడియో గ్రాఫర్లు, బందోబస్తు కొరకు ఉత్తర్వులు అందుకున్న ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, మాజీ సర్వీస్ మెన్ ఇతర యూనిఫాం సర్వీస్‌ల వారు పనిచేస్తున్న జిల్లాలోనే సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రెండు ఫారం 12 అప్లికేషన్‌లను(ఒకటి పార్లమెంట్‌కు, రెండోవది అసెంబ్లీకి) ఎన్నికల విధుల నియామక ఉత్తర్వులు మరియు ఓటరు కార్డు ప్రతిని జతపరచి ఈనెల 26వ తేదీలోగా సమర్పించాలని, ఓటు వేయడానికి ఆఖరి తేది మే 8వ తేదీ అని, ఈ ఫెసిలిటేషన్ వివరాలను ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులకు, రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు ముందుగానే సమాచారం అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

అనధికార నిర్మాణాలను గుర్తించాలి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార నిర్మాణాలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదేశించారు. సోమవారం తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అనధికార కట్టడాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని, అనధికార హోర్డింగ్‌లు, అభ్యంతరకరమైన ఆక్రమణలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను గుర్తించి వారికి నోటీసులు అందజేయాలని అగ్ని భద్రతా చర్యలు లేని భవనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అనుమతి లేని హోర్డింగ్‌లు, డిస్‌ప్లే బోర్డులకు జరిమానా విధించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

టీడీపీ ర్యాలీకి డబ్బులిస్తామని పిలిచి..

- తీరా లేవు పొమ్మన్నారు..
- ఇంటికి వెళ్లాడానికి ఆటోకి సైతం డబ్బులు ఇవ్వలేదు
- కొన్ని కిలోమీటర్లు నడిపించారు..
- ర్యాలీ కోసం వచ్చిన వారిని ముప్పతిప్పలు పెట్టిన టీడీపీ శ్రేణులు
- ఓ టీడీపీ నాయకురాలిని నిలదీసిన లింగాయపాలెం ప్లాట్లకు చెందిన కాలనీ వాసులు



టీడీపీ నాయకురాలిని నిలదీస్తున్న లింగాయపాలెం ప్లాట్లుకు చెందిన కాలనీ వాసులు

నెహ్రూనగర్: టీడీపీ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీకి వచ్చిన ప్రజలు తమకు ఇస్తామన్న డబ్బులు ఇవ్వలేదని ఆ పార్టీ నాయకులను నిలదీశారు. మనిషికి రూ.500 చొప్పున ఇస్తామని ఒప్పందం కుదుర్చుకుని ర్యాలీకి పిలిచి.. తీరా ర్యాలీ అయిపోయిన తరువాత డబ్బులు అడిగితే లేవు పొమ్మంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం దాకా ఆగండి అప్పుడు ఇస్తాం .. ఇప్పుడు మీరు వెళ్లిపొండని ఓ టీడీపీ మహిళా నాయకురాలు చెప్పడంతో లింగాయపాలెం ప్లాట్లుకు చెందిన కాలనీ వాసులకు చిర్రెత్తుకొచ్చింది. అప్పటి దాకా ఎండలో నడిపించారు.. కనీసం మంచినీరు కూడా ఇవ్వకపోగా.. ఇంటికి వెళ్లడానికి ఆటోకి డబ్బులు అడిగితే లేవంటే ఎలా అంటూ సదరు మహిళా నాయకురాలిపై తిట్ల దండకం మొదలు పెట్టారు.

వివరాల్లోకి వెళితే.. సోమవారం టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవిలు నామినేషన్‌లు వేశారు. భారీగా జనసమీకరణ చేశారు. అయితే ర్యాలీకి వచ్చినవారికి ఇస్తామన్న డబ్బులు ఇవ్వకపోవడంతో టీడీపీ నాయకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నామినేషన్ వేసేందుకు లింగాయపాలెం ప్లాట్లు దగ్గరలో ఉన్న కాలనీ వాసులు తీసుకురావాలని టీడీపీకి చెందిన ఓ మహిళ నాయకురాలు కాలనీకి(లాల్‌పురం దగ్గర) చెందిన సీహెచ్ కృష్ణవేణికి ఫోన్ చేసింది. మనిషికి రూ.500 ఇస్తామని చెప్పడంతో కృష్ణవేణి కాలనీకి చెందిన 160 మందిని ఆటోల్లో తీసుకువచ్చింది. తీరా ర్యాలీ అయిపోయిన తరువాత డబ్బులు ఇవ్వాలని అడిగితే సాయంత్రం ఇస్తాం..ఇప్పుడు లేవని చెప్పడంతో కాలనీ వాసులు సదరు మహిళా నాయకురాలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఇవ్వడం చేత కానప్పుడు ఎందుకు పిలవడం అంటూ మండిపడ్డారు.

కనీసం మంచినీళ్లు ఇవ్వలేదు

ర్యాలీ ఉంది.. రూ.500 ఇస్తామంటే లింగాయపాలెం ప్లాట్లు నుంచి వచ్చాం. గుంటూరుకు రమ్మన్నారు. గుంటూరులో అడ్రస్ అర్థం కాక అటు ఇటు కాళ్లు అరిగేలా తిరిగాం. తీరా ఎలాగోలా ర్యాలీ దగ్గరకు చేరుకున్నాం. నగరం అంతా నడిపించారు. కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదు. తీరా ర్యాలీ అయిపోయిన తరువాత డబ్బులు అడిగితే లేవని అంటున్నారు.

– ధనలక్ష్మి, లింగాయపాలెం ప్లాట్లు

ఫోన్ చేసి జనాలు కావాలంటే తీసుకొచ్చా..

గుంటూరు నగరంపాలేనికి చెందిన ఓ నాయకురాలు నాకు ఫోన్ చేసి ఇవాళ టీడీపీ ర్యాలీ ఉంది.. జనాలను తీసుకురావాలంటే 160 మందికిపై జనాలను ఆటోలో తీసుకొచ్చాను. తీరా ర్యాలీ అయిపోయిన తరువాత మీరు అంత మంది రాలేదు. నేను అంత ఇవ్వను. 118 మందికే డబ్బులు ఇస్తాను. అది సాయంత్రం నాలుగు గంటల దాకా ఉంటామంటేనే ఇస్తామంది.

– కృష్ణ వేణి, లింగాయపాలెం ప్లాట్లు

ఎమ్మెల్యే గిరికి అభినందనల వెల్లువ



మహిళ విభాగం నేతలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షుడిగా నియమితులైన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. శ్యామలానగర్‌లోని ఆయన నివాసం, బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయం వద్దకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. దుశ్శాలువలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఆయన్ను ఘనంగా సత్కరించారు. పార్టీ మహిళ విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ తనపై అభిమానంతో శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం ఏం ఆదేశించినా తు.చ. తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. గుంటూరు పశ్చిమ, తూర్పు, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్‌ఇన్‌చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: ప్రతి గర్భిణీకి తప్పనిసరిగా బీపీ పరీక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో సోమవారం ఎంఎల్‌హెచ్‌పీలకు కేర్ క్యాంపేనియన్ ప్రొగ్రామ్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గర్భిణికి తప్పనిసరిగా బి.పి చూడాలని, ప్రమాదకర గర్భిణులను గుర్తించేందుకు వీలైనంత త్వరగా బీపీ, మధుమేహం, థైరాయిడ్, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. తరచుగా వారి ఆరోగ్యంపై మెలకువగా ఉండాలని, హైరిస్క్ గర్భిణులను హెచ్‌ఐవీ, పి.హెచ్.ఎస్‌కు ట్యాగ్ చేసి కాన్పును పర్యవేక్షించాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఎస్‌డీసీ (సేఫ్ డెలివరీ క్యాలెండర్) ప్రదర్శించి కాన్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కిశోర బాలికల పోషణ విషయంలో మెలకువలు తెలియజేసి, బహిష్టు సమయంలో పాటించవలసిన పరిశుభ్రతను తెలియజేయాలన్నారు. డాక్టర్ లక్ష్మీసుధా, డాక్టర్ గిరిధర్, భానుశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మత్తు పదార్థాలు కలిగిఉన్న వ్యక్తి అరెస్టు



పట్నంబజారు: గుంటూరు నగరంలో సోమవారం పోలీసులు మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కమ్మ శేషయ్య గ్రౌండ్ సమీపంలోని ఆషా పూరి అనే టీస్టాల్ వద్ద రాజప్రహిత్ మహేంద్రసింగ్ అనే వ్యక్తి ఒక బ్యాగు పట్టుకుని అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పక్కా సమాచారం అందుకున్న లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.దేవప్రభాకర్, సిబ్బందితో కలిసి దాడిచేశారు. మహేంద్రసింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతని బ్యాగులో ఆరు ప్యాకెట్లు మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో 11 గ్రాముల బరువు గల మెతంఫెతామైన్ అనే మత్తు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. రాజస్థాన్ నుంచి తన స్నేహితుల ద్వారా సరఫరా చేస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు తెలిపారు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై దాడి ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీ అగ్రహారం 2వలైనులో షేక్ మస్తాన్‌వలి నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం మస్తాన్‌వలి తన ఆటో అద్దాలు పగులగొట్టి ఉండటం గమనించాడు. తన ఆటో అద్దాలు ఎవరు పగులగొట్టారని కట్టా సతీష్‌ను ప్రశ్నించాడు. ఈవిషయంపై ఇరువురి మధ్య గొడవ జరిగింది. కట్టా సతీష్ కర్రతో మస్తాన్‌వలిపై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనిల్‌కుమార్ కారుపై టీడీపీ నాయకుల దాడి

నెహ్రూనగర్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ కారుపై టీడీపీకి చెందిన కొంత మంది నాయకులు దాడి చేశారు. సోమవారం అరండల్‌పేటలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో తన కుటుంబ సభ్యుల చికిత్స నిమిత్తం వెళ్లిన తన కారుపై అక్కడ కొంత మంది టీడీపీ గుండాలు దుర్భాషలాడుతూ, కారుపై దాడికి దిగారని అనిల్‌కుమార్ వాపోయారు. ఈ సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరికల్లు రవి

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరుకు చెందిన వరికల్లు రవికుమార్‌ను వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ (వైఎస్సార్ టీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

జీజీహెచ్‌లో ప్రతిరోజూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ప్రతిరోజు గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం జీజీహెచ్‌లోని 15వ నెంబర్ ఓపీలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగాన్ని డాక్టర్ కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు రోగులకు అందుబాటులో లేకపోవడంతో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏంటీ కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహంలు ప్రత్యేక చొరవ తీసుకుని సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావును నియమించారని చెప్పారు. ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. ఈ విభాగం సోమ, బుధ, శుక్ర వారాల్లో పనిచేస్తుందని, మిగిలిన రోజుల్లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ పని చేస్తుందని తెలిపారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ధరిత్రీ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

లక్ష్మీపురం: ధరిత్రీ పరిరక్షణలో అందరూ భాగస్వాములై భావితరాల మనుగడకు, జీవన భద్రతకు భరోసా కల్పించాలని పర్యావరణ పరిరక్షణ ఉద్యమనేత టి.నారపరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి స్వయం కృతాపరాధాల వల్ల పీల్చేగాలి, తాగేనీరు, పండించే నేల తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, హెల్త్ ఎవర్‌నస్ అధ్యక్షుడు అచ్యుత ఇందుశేఖర్ మాటాడారు. అవగాహన సభ్యులు పాల్గొన్నారు.

'మహాభారతం.. మహర్షులు..' గ్రంథావిష్కరణ



గ్రంథావిష్కరణ చేస్తున్న అతిథులు

నగరంపాలెం: మహాభారత కాలం నాటి ఆదర్శాలు ఈ కాలానికి ఎంతమేర ఉపయోగపడతాయనేది రచయిత్రి చక్కగా వివరించారని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. డాక్టర్ నల్లపనేని విజయ లక్ష్మి రచించిన ఆంధ్ర మహాభారతం - మహర్షులు - ప్రబోధం - ప్రయోజనం అనే గ్రంథావిష్కరణ సభ సోమవారం సాయంత్రం బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై జరిగింది. సభకు డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించగా, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, ఏఎన్‌యూ తెలుగు ఆచార్యులు ఎన్వీ కృష్ణారావులు మాట్లాడారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ సుంకర గోపాలయ్య పుస్తక సమీక్ష చేశారు.